# హైదరాబాదులో స్వర్గం

అన్వర్ సేటు నాలుగో భార్య నలుగురిలో చిన్నది. అతి సుందరమైన ఫాతిమా డ్రాయింగు రూమ్‌కు అవతల విశాలమైన హాలుకు మరోవైపు వున్న ఒక సోఫాలో, ఏదో దుఃఖంలో మునిగి, కళ్లు తుడుచుకుంటూ కూర్చున్న దృశ్యం డ్రాయింగు రూములో ప్రవేశించగానే, హుసేన్‌ఖాన్ గమనించాడు. డ్రాయింగు రూముకు లివింగ్ రూమ్‌కు మధ్యన వున్న దాదాపు పండ్రెండు అడుగుల వెడల్పున్న ప్రవేశద్వారాన్ని ఆచ్ఛాదనం చేసి వున్నా, లేక ఆకుపచ్చ రంగుల్లో వున్న బంగారు తీగలతో పత్రాలు, పుష్పాలతో అలంకృతం చేసిన అవనిక మధ్యలో ఒక ఆరంగుళాల ఖాళీ వుండడం వల్లనే హుసేన్‌ఖాన్ డేగచూపులు ఆ అపూర్వ దృశ్యాన్ని చూడగలిగాయి. సకల సుఖ సమృద్ధులతో బతుకుతున్న, ఆ యువతికి సంకటమా? శ్వేత వాయసం తలక్రిందులుగ ఎగురుతుందా?

అన్వర్ సేటుకు తెలియని వాళ్లు బెంగుళూరు నగరంలో వుండడానికి వీలులేదు. అలా కొందరు అపూర్వ వ్యక్తులు వుంటేమాత్రం వాళ్లు అక్కడకు మొదటిసారిగా వచ్చిన వినోదయాత్రికులు కావచ్చు; లేక గత ఇరవైఐదు, ముప్పై సంవత్సరాలుగా అదే నగరంలో సర్వసంగ పరిత్యాగులుగా బతికి చచ్చే, స్త్రీ విద్వేషులు కావచ్చు. లేక, చిన్న మనోవైకల్యంతో, ఆసుపత్రిలో ప్రవేశించి, తద్వారా పూర్ణ చిత్తరోగులుగా మారిన భాగ్యహీనులు కావచ్చు. పెద్ద విద్యా యోగ్యత ఏమి లేకపోయినా కూడా, జన్మతః ఇంగ్లీషు తెలిసిన పాశ్చాత్య పౌరులతోకూడా, ఆ విదేశ భాషలో మాట్లాడగలిగే ఒక వాణిజ్య చక్రవర్తి మన అన్వర్‌సేట్. తొమ్మిది మంది కూతుళ్ల తరవాత పదో సంతానం అవతరించిన అన్వర్‌కు పది సంవత్సరాలు, పదిమాసాల పదిరోజుల వయసు పూర్తి కావడంతోనే నాసరు నవాబు ''ఖుదా''కి ''ప్యారా'' అయినాడు. ఆస్తులు పుష్కలంగా వుండే ఆ కుటుంబంలో, ఒక రాజకుమారిడిలాగ అన్వర్ పెరిగాడు. చదువు విషయంలో పెద్దశ్రద్ధ చూపించకపోయినా, పదిహేను, పదహారేళ్ల వయసులో కూడా చనిపోయిన తండ్రి వ్యాపార విషయాలన్నీ అతడు విని చూసి తెలుసుకున్నాడని మాత్రమే కాదు, ఆ వ్యాపారాలను మంచి తెలివితో నడపడం కూడా నేర్చుకున్నాడు. ఇంటర్మీడియట్ వఱకు చదివి, ఫైనల్ పరీక్ష వ్రాయకుండానే కాలేజికి పోవడం ఆపేశాడు. చేతిలో డబ్బు దండిగా వున్న ఆ యువకిశోరానికి, మిత్ర బృందము ఎప్పుడూ సన్నిహితంగా వుండేది. మదిర మధురాక్షులు అన్వర్‌కు చిన్నప్పుడే అలవాటయిపోయినాయి. అతని తల్లికి, అతన్ని అదుపులో పెట్టడం సాధ్యం కాలేదు. వ్యాపార బాధ్యతలన్నీ తనపైనే వేసుకున్న ఆ యువకుడు చాలా సమర్థతతో, తన సంస్థలను దినదినం ప్రవర్ధమానంగా నడిపించేవాడు. పగలంతా కష్టపడి పనిచేస్తాడు. రాత్రి రెండు, మూడు గంటల వఱకు స్నేహితులతో కలసి సుఖభోగాలు అనుభవించే

వాడు. బలిష్టమైన యౌవనము కదా? రక్తం ఉడుకుతున్న వయసు కదా? అన్వర్ జీవితం సరిగ్గా అనుభవిస్తున్నాడు. ఇరవై నాలుగేళ్లు రావడంతో, అతని తల్లి, అతనికి నిఖా చేయించింది. దానితర్వాత అతని నిశాచరత్వం కొద్దిగా తగ్గింది.

సంవత్సరాలు దొర్లిపోతున్నకొలది అతని వాణిజ్య సామ్రాజ్యం వికసిస్తూ వచ్చింది. దానితోపాటు అతనికి జనరంజకత్వం కూడా పెరుగుతూనే వచ్చింది. అతనికి ముప్ఫైయేళ్లు వచ్చేసరికి అతని తల్లి పరలోక ప్రాప్తి చెందింది. గాని తరవాతనే ఇప్పుడు అతను నివసిస్తున్న విశాల భవనం కట్టారు. అతని పాత ఇల్లు కూడా పెద్దదే. కాని, పురాతన పక్కీలో వుండేది. తల్లి బ్రతికి వుండేటప్పుడు ఆ పాత ఇంటిని వదలి వెళ్లడానికి అన్వరును అనుమతించలేదు. ఈ నవీన సౌధంలో తొమ్మిది పడక గదులున్నాయి. ఇంటికి ముందు, వెనక మనోహరమైన పూలతోటలున్నాయి. ఒక ప్రక్కన బయటనుంచి కనబడే ''స్విమ్మింగ్‌ఫూల్'' ఆ ఇంటికి ఒక ప్రత్యేక దర్జాను చేకూర్చింది. కొన్ని కార్లు షెడ్లో వున్నాయి, కొన్ని కార్లేమో షెడ్ల బయట వున్నాయి. అలా దాదాపు తొమ్మిది, పది కార్లు వుండవచ్చు.

ఆ నవ్య రమ్య హర్మ్యం తయారు అయేటప్పుడు అతని వయస్సు 32 యేళ్లు. అంత లోపల అతనికి ముగ్గురు పిల్లలు పుట్టారు. ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల. ఆయన బీబీది మెత్తటి స్వభావం. ఆమె మంచి డబ్బుగల కుటుంబం నుంచి వచ్చిందయినా, ఆ డబ్బు పొగరు ఆమెలో ఏమాత్రం లేదు. తను చెప్పినట్టే ఇతరులు నడుచుకోవాలనే ఉద్దేశ్యంగానీ, అభిప్రాయంగాని ఆమెకుండేది కాదు.

అన్వర్‌కు ముప్పై మూడు వచ్చేటప్పటికి అతని సుందర సౌధానికి, ఒక క్రొత్త అతిథి వచ్చింది. ఎవరు చూసినా కాంక్షించే, ఒక ఆంగ్లో-ఇండియన్ వివాహోచిత తరుణీమణి. వయస్సు దాదాపు ఇరవై ఎనిమిది వుండొచ్చు. కాని చూడ్డానికి పద్దెనిమిది లాగా కనబడుతుంది. అందమైన గుడ్డలు ధరిస్తుంది. కానీ, ఆ ఇంటి స్విమ్మింగ్ ఫూల్ చూసిన తరవాత, ఆ బట్టలు విప్పడం కూడా ఆమెకు వినోదంగా వుండేది. కొద్ది రోజుల్లోనే ఆమె ఆ ఇంట్లో ద్వితీయ కళత్రస్థానం సంపాదించింది. కానీ, అన్వర్‌కు కొన్ని వ్యక్తిగత సిద్ధాంతాలుండడం వల్ల ఆ క్రిష్టియన్ మహిళ మతాన్ని మార్చుకోవలసి వచ్చింది. అదృష్టవశాత్తు ఆమెకు సంతాన భాగ్యం లేదు. ఇప్పుడు ఆమె వయస్సు యాభైఐదు. అన్వర్‌తో ఆమె అప్పుడప్పుడు పోట్లాడుతంది. ఒక్కోసారి, ఒకరెండు వారాలు ఆమె ఎక్కడికో వెళ్ళిపోతుంది. సైనబాతో ఆమెకు ఎప్పుడూ ఎలాంటి గొడవలు లేవు.

అన్వర్‌కు నలభై ఐదు యేళ్లప్పుడు ఆ ఇంటిలోకి మిరపకాయలంటూ ఒక అమ్మాయి దిగి వచ్చింది. అంతమంచి రంగు లేకపోయినా, ప్రదీప్త ప్రజ్ఞ ఉన్న నగ్నా అన్వర్‌ను తన జేబులో పెట్టుకోవడమే కాకుండా అతడు సీనియర్ రాణులతో సల్లాపం

చేయడం గురించి కూడ పోట్లాడేది. కాలక్రమేణ, ఆ ఇంటిలో వుండే సకల మానవులకు, సమస్త ప్రాణులకు ఆమె ఒక సింహస్వప్నంగా తయారయింది. నిజం చెప్పాలంటే అన్వర్‌కు గూడా ఆమె అంటే భయంగా వుండేది. కాని ఎంతకాలం అతను అలా భయపడతాడు?

అన్వర్‌కు సైనబా వల్ల పుట్టిన ముగ్గురు పిల్లల పెళ్ళిళ్ళు అయిపోయినాయి. ఇద్దరు కొడుకులు కూడా అమెరికాలో వున్నారు. ఒకడు ఇంజనీర్ అయితే, చిన్నవాడు దంతవైద్యుడు. కూతురు భర్త ఢిల్లీలో వుండడం వల్ల, అది కూడా ఐ.ఏ.ఎస్‌లో ఒక ఆఫీసరు కావడంవల్ల, మంత్రులు నివసించే బంగళాలకంటే గొప్పదైన ఒక బంగళాను డెబ్బై ఐదు లక్షలకు కొని, కూతురు పేర రాయించాడు.

అన్వర్‌ను మర్యాదగా నిద్రపోనీయకుండా, ఎనిమిది, తొమ్మిది సంవత్సరాల లోపల ఐదుసార్లు నగ్మా ప్రసవించ గలిగింది. కాని, ఆమెకొక కొడుకు కావాలనుండేది. కాని, అన్వర్‌కు ఆ విషయంలో చాలా భయముంది. ఎందుకంటే తన తల్లికి పుట్టినట్టు తొమ్మిదిమంది ఆడపిల్లల తర్వాతనే ఒక సుపుత్రుడు పుడతాడనే న్యాయమైన భయముండేది. నగ్మాతో వుండే బంధంవల్ల కావచ్చు... అంటే అతన్ని నియంత్రించ డంలో ఆమె చేసే ప్రయత్నాల కారణంగా కావచ్చు... లేక ఆంగ్లో ఇండియన్ ముస్లిం భార్యతో నగ్మా చేసే అధర్మయుద్ధాల వల్ల కావచ్చు... లేక ఆ 'అఃఇఃముః' భార్యతో ఆయనకుండే ధర్మయుద్ధాల వల్ల కావచ్చు, ఆ కుటుంబ వాతావరణమంతా చాలా వేడిగా వున్నట్టుంది. అన్వర్‌కు ఈ మధ్యన క్షిప్రకోపం ఎక్కువయింది. అతని వయసుకంటే ఎక్కువ వయస్సు ఆ ముఖంలో కనిపిస్తోంది. మధుమేహరోగం, ఊర్ధ్వ రక్తపీడన రోగం అతన్ని పీడిస్తున్నాయి. తన వాణిజ్య సామ్రాజ్యభారం తనకు మోయలేనంత పెరిగినా కూడా తనకు చేదోడు ఇవ్వడానికి కొడుకులలో ఒకడు కూడా స్వదేశానికి తిరిగి రావడానికి ఇష్టపడడం లేదనే విచారం, అతన్ని మరింత క్రుంగదీసింది. భార్యలు వాళ్ళల్లో వాళ్ళు పోట్లాడుకనేటప్పుడు లేక తనతో పోట్లాడేట ప్పుడు అతను వాళ్ళను తన్నడం కూడా మొదలుపెట్టాడు. 'థర్డ్ డిగ్రీ' చేయకూడ దంటే మళ్ళీ నియంత్రణ తన చేతిలో ఎలా వుంటుంది?

అతని వయస్సు యాభై ఎనిమిదికి చేరింది. మామూలుగా ప్రభుత్వ ఉద్యోగస్థులు, ఉద్యోగ విరమణ చేసే ప్రాయం. కాని, అన్వర్, తను చేస్తున్న ఉద్యోగాలేకాకుండా, అదనంగా ఇంకొక ఉద్యోగం కూడా తీసుకున్నాడు. ఇరవై వయసుగల ఫాతిమాకు తాత కావడానికి తగిన ప్రాయంవున్న అన్వర్ ఆమె భర్తకు ఉద్యోగం కూడా లంచం ఇచ్చి ఆమెను సంపాదించాడు. మొదటి 'నిఖా' కాకుండా, మిగిలిన మూడు పెళ్ళిళ్ళు కూడా అతను ఒక విధంగా రహస్యంగానే చేసుకున్నాడు. ఫాతిమాను తెచ్చుకొని ఒకరోజు సాయంత్రం అతను ఇంటికి చేరేటప్పుడు నగ్మా 'అ: ఇ: ము:' భార్యలు ఎంతో నీచమైన పదాలతో వాళ్ళను ఆక్షేపించడం జరిగింది. నగ్మా ఆ చిన్నమ్మాయినే

ఒక ఊరకుక్క అనీ, వేశ్య అనీ పిలిచేటప్పుడు అది సహించడం సాధ్యం కాకుండా, ఇంటి బయటికు పరుగెత్తికెళ్ళి, ఆమె వచ్చిన కార్లో కూర్చుని ఏడ్చింది. ఆ క్రొత్త పెళ్లి కొడుకు అన్వర్ సేట్ పది నిముషాల పాటు ఆమెతో ప్రేమ పురస్సరంగా మాట్లాడి, ఇంటి విషయాలు వివరంగా తెలియజేసి, మేడపై తన పడకగదికి తీసుకెళ్లి బయటనుంచి తలుపులు మూసేసి మళ్లీ క్రిందకు దిగివచ్చాడు. బెల్ట్ తీసి నగ్మాను చిత్తుచిత్తుగా కొట్టాడు. ఆ దెబ్బలు తింటూ కూడా ఆమె బూతులు తిట్టడం కొనసాగించింది. ఆమె పిల్లల దయనీయ రోదనాల వల్లనే, దాదాపు స్పృహ తప్పిన ఆ భద్రకాళిని అతను చంపకుండా వదలిపెట్టాడు.

ఒక బీద కుటుంబంలోని నలుగురు ఆడపిల్లల్లో మూడో అమ్మాయి ఫాతిమా. ఐదవ తరగతి వఱకు చదివి, మిగిలిన చదువును ఇంట్లో కూర్చుని చదివిన ఆమె ఆ నలుగురిలోకి అందగత్తె. సమర్థురాలే కాక సంగీత వాసనకూడ ఆమెకుంది. ఆమె పెద్దక్క, ఒక ముసలి షేక్ బీబీగా, విదేశీ వాసం అనే మధుర స్వప్నంతో వెళ్లిన ఆరు నెలల లోపల ఎలాగో ప్రాణంతో తిరిగి వచ్చింది. రెండో అక్క ఒక పోలీసు వాడిని అరెస్టుచేసి చాలా సుఖంగా అతని (లాకప్)తో గడుపుతుంది. ఫాతిమా, ఈ ముసలి వాడిని వివాహం చేసుకోవడంలోని ఉద్దేశ్యం వేరే ఏమి లేదు. వార్ధక్యంలో వున్న తల్లిదండ్రులు, దిక్కులేని పెద్దక్క, పదిహేను యేళ్లు దాటి 'నాక్కాహ్' కొఱకు ఎదురుచూస్తున్న చెల్లాయిల పోషణ కోసమే.

అన్వర్ సేట్ ఆమెతో ఎంతో వాత్సల్యంతో ప్రవర్తించేవాడు. ఒక శిశువును చూసినట్లు ఆమెపెట్ల ఎంతో శ్రద్ధ చూపేవాడు. కాలక్రమేణా ముగ్గురు పెద్ద రాణులు ఆమెను తమ మధ్యలో సర్దుబాటు చేసుకోవటం జరిగింది. నగ్మా అన్యాయ ఏమాత్రం తగ్గలేదు. కానీ అన్వర్ సేఠ్ గారి తీక్ష కోపానికి భయపడి, మళ్లీ ఎలాంటి గొడవను ఆమె సృష్టించలేదు. అతనికి ఎక్కువ చికాకు కలిగిస్తే... ఓయ్, అల్లా... తనకు అతను ''తలాఖ్'' ఇస్తే తనతోపాటు తన పంచ బాలికలు కూడా నిరాధారులౌతారు. అందరు భార్యలకు, వారి సంతానానికి కనీసం మూడు తరాలవంతు సుఖ సమృద్ధులతో బ్రతకటానికి కావల్సిన ఆస్తులు ఆ కుబేరుడి దగ్గర వున్నాయి. అతనికున్న తొమ్మిది మంది అక్కలకు వాళ్ల పిల్లలకు కూడ అతను పుష్కలంగా ఇచ్చాడు. అందుకే ఆ ముసలివాడు చాలా మంచివాడు. అతనికి ఎక్కువ చికాకు కలిగిస్తే 'దుష్మన్' అయిపోతాడు.

ఫాతిమా హనీమూన్ దాదాపు ఒక సంవత్సరం వఱకు మధురంగా కొనసాగింది. ఆమె కొత్తదనం పోయిందని అనుకోవడంతో, ఆ ముసలివాడు ఆమెతో కూడా కొంచెం పరుషంగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. నలుగురిలో, ఆమె అంటేనే ఎక్కువ ఇష్టం వున్నాకూడా... ఆమెకు, ఆమె ఇంటివాళ్లకు కావల్సిందంతా ఇస్తున్నా, శయన గృహంలో ఆమెను తృప్తి పరచడానికి శక్తి లేనట్లు ఆయనకు అనిపించింది. రాత్రి

నాలుగైదు పెగ్గుల విస్కీ తాగకుండా వుండడం అతనికి సాధ్యం కాదు. బయట కానీయండి, ఇంట్లో కానీయండి అతని కోటా అతనికి రావాల్సిందే. దాని తర్వాత, ఆరాత్రి అతను ఏమేమి చేశాడు అనేది మరుసటిరోజు పొద్దున అతనికి గుర్తుండేది కాదు. వయసులో మొలకగావున్నా ఆ చిన్న అమ్మాయి ఇంకో మగ మొలకతో ఏమైనా రహస్య సంబంధం పెట్టుకుంటుందేమో అని ఒక న్యాయమైన అనుమానం అతనికి కలిగింది. రోజు రోజుకు అ అనుమానం పెరుగుతూ వచ్చింది. ఆమె ప్రతి చలనాన్ని గమనించడానికి అతను రహస్యంగా ఏర్పాట్లు చేయడం కూడా జరిగింది. తనకు తల్లి కావడానికి అవకాశం చాలా తక్కువగా వుందని ఆమె తెలుసుకుంది. అయినా గూడా, ఆ ముసలి భర్తను మోసం చేయాలనే ఉద్దేశ్యం ఆమెకు ఎప్పుడూ కలుగలేదు. ఆమె యౌవ్వనానికి సంభవించిన నష్టానికి పరిహారంగా ఒక సమృద్ధ జీవితం తనకు, తన వాళ్లకు ప్రసాదించినందుకు ఆమె ''ఖుదా''కు ''షుక్రియా'' చెప్పేది. ఆమె ఒక మంచి అమ్మాయి; ధైర్యం, సహనశక్తి ఆమెకు ఉన్నాయి.

ఒక కాంచన పంజరంలో వున్నా, తాను ఒక బందీనే కదా అన్న బాధ ఆమెను బాధించేది. రోజులు గడుస్తుండగా అన్వర్ సేఠ్‌కు తనపై ప్రేమ తగ్గుతున్నట్టు, చిన్న చిన్న విషయాలలో కూడా తనను తిట్టడంలో అతని కర్కశత్వం పెరుగుతున్నట్టు ఆమెకు అనిపించింది. తరవాత, కోపం వచ్చేటప్పుడు అతను ఆమెను కొట్టడం కూడా ప్రారంభించాడు. ఆవిధంగా ఒకరోజు ఉదయం అకారణంగా తిట్లూ, తన్నులూ తిన్న తరవాత ఆమె ఒక మూల కూర్చొని దుఃఖంలో కన్నీరు కారుస్తున్న సందర్భంలో, ఆ హుసేన్ ఖాన్ డ్రాయింగు రూములోకి రావడం, ఆమెను చింతాక్రాంతగా చూడడం జరిగింది.

హుసేన్ ఖాన్ ఆమెను చూసి ఒకసారి చిన్నగా దగ్గాడు. ఫాతిమా లోపలికి వెళ్లిపోదామనుకొని లేవగానే అతను తెర కొంచెం ప్రక్కకు జరిపి, ''బేటీ ఫాతిమా'' అని ప్రేమ పూర్వకంగా పిలిచాడు.

ఫాతిమా తండ్రి, హుసేన్‌ఖాన్‌లు ఎంతో దగ్గర మిత్రులు. ఫాతిమా తండ్రి పెద్ద కుటుంబానికి చెందిన వ్యక్తి. ఆ కుటుంబంలో జరిగిన కొన్ని కలహాల వల్ల, ఆ మొత్తం కుటంబానికే కాలదోషం పట్టింది. ఫాతిమాకు ముగ్గురు అక్కచెల్లెళ్లు వుండడంవల్ల, ఆ నలుగురు అమ్మాయిల బరువు మోసిమోసి ఆ ముసలివాడు చాలా అలసిపోయాడు. అతనికి కొంచెమైనా ఉపశమనం కలిగిద్దామనే ఉద్దేశంతో హుసేన్ ఖాన్ అన్వర్ సేట్ పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చాడు. ఆయన ఫాతిమాతో ఆ విషయం గురించి మాట్లాడేటప్పుడు తన కుటుంబ దారిద్ర్యాన్ని దూరం చేయడానికి, దేనికైనా తాను సిద్ధపడతానని ఆమె చెప్పింది. దాని తర్వాత హుసేన్ ఖాన్, అన్వర్ సేఠ్‌కు ఫాతిమా ఫొటో చూపించి విషయం కదిలించాడు. ఆ ఫోటోతోనే ''మహబ్బత్''లో పడిన ఆ ముసలివాడికి,

తరవాత ''నిఖాహ్'' దాకా ఒకటే తొందరగా వుండేది. తన్వర్ సేఠ్‌కు ప్రాణమిత్రుడయిన హుసేన్ ఖాన్ ఫాతిమాను సొంత కూతురు అనే అనుకునే వాడు.

హుసేన్ చాచా స్నేహపూరితమైన ''బేటి ఫాతిమా'' అనే పిలుపు వినగానే కళ్లు తుడుచుకొని, డ్రాయింగు రూములోకి ఆమె పరుగెత్తికెళ్లింది. హుసేన్ ఖాన్ ఆమెను దగ్గరకు తీసుకొని నుదుడిపై ముద్దు పెట్టుకొని ''ఎందుకు బేటీ ఖుషీకా లేవు'' అని అడిగాడు.

''ఇలా బ్రతకటం నావల్ల కాదు చాచా. ఈ మధ్యన ప్రతిరోజు నాకు తన్నులూ తిట్లూ తగుల్తున్నాయి. ఆయన స్వభావం చాలా మారిపోయినట్లుంది. తాగిన తరవాత అయితే కొట్టడం, తన్నడం, త్రాగకుంటే తిట్టడం. ఇప్పుడు తాగకుండా వుండేటప్పుడు గూడా కొట్టడం, తన్నడం చేస్తున్నాడు. ఇంక నావల్ల కాదు. ఇంకా కొద్దికాలం ఇక్కడే వుంటే నాకు పిచ్చెక్కుతుంది. లేకపోతే నేను ఆత్మహత్య చేసుకోవాల్సి వస్తుంది'' అని చెప్పి శబ్దం బయటకు రాకుండా వెక్కి వెక్కి ఏడ్చింది.

''బేటీ! నేను అన్వర్‌తో మాట్లాడి చూస్తాను. ఎక్కువ బాధపడకుండా వుండు. బంగారం లాటి మనిషి అతను. ఈ ఇంట్లో నీకు దేనికైనా తక్కువగా వుందా. నీ వాళ్ల కోసం అతను ఎంతో ఖర్చు పెట్టాడు. నీవు ఎక్కడుకు పోవాలన్నా, బెంజ్ కార్లున్నాయి. దూరం ఎక్కడకైనా వెళ్లాలంటే ప్లేన్‌లోనే పంపిస్తాడు. నీకు లేని ఆభరణాలు, వస్త్రాలు ఈ ఊళ్లో వేరే ఇంకొక అమ్మాయికి వున్నాయా? మనుష్యులు ఎప్పుడూ ఒకే మాదిరి వుంటారా? మంచిరోజులు, గడ్డురోజులు వస్తుంటాయి, పోతుంటాయి. ఏమైనా ఇప్పుడు నీవు దారిద్ర్యం అంటే ఏమటో తెలియకుండా బతకగలుగుతున్నావు కదా? నీ తల్లితండ్రులు, అక్క చెల్లెళ్లు చాలా సుఖంగా బ్రతుకుతున్నారు. అన్వర్‌కు ఈ మధ్యన కొంచెం ''గుస్సా'' ఎక్కువ అయినట్టు అందరికీ తెలుసు. ఇంత పెద్ద బిజినెస్‌లో, ఆయనకు తోడుగా ఎవరున్నారు? పాపం రాత్రి పగలు అతను కష్టపడి పని చేస్తున్నాడు. అదికూడా ఈ వయసులో. నీవు కొంచెం ఓపిగ్గా వుండు, అన్నీ సర్దుకుంటాయి'' అని ఆమె వీపు నిమురుతూ, ధైర్యం చెబుతూ ''నేను తరువాత ఎప్పుడయినా వస్తాను'' అని చెప్పి హుసేన్ ఖాన్ వెళ్లిపోయాడు.

తరవాత ఒక నెల గడిచిపోయింది... హుసేన్ ఖాన్‌కు దిగ్భ్రాంతి కలిగించే వార్త ఒకటి వచ్చింది... ఫాతిమా ఎక్కడికో పారిపోయిందని. ఎవరితోనో లేచి పోయుంటుందని అన్వర్ అనుమానిస్తున్నాడు. ఫాతిమా ఇంటి వాళ్లంతా ఒకటే ఏడుపు... మూడు నెలలు గడిచిపోయాయి. ఫాతిమా గురించి ఎలాంటి వివరం తెలియలేదు. ఆమె ఎక్కడికో వెళ్లి ఆత్మహత్య చేసుకొని వుంటుందని కొంతమంది అనుకున్నారు.

హుసేన్ ఖాన్ కనీసం నెలకొకసారి హైదరాబాద్‌కు వెళుతుంటాడు. ఒకసారి అలా వెళ్ళినపుడు అతను ఒక సైకిల్ రిక్షాలో అబిడ్స్ రోడ్డునుంచి బేగం బజారుకు

వెళుతున్నాడు. మొజంజాహి మార్కెట్ దాటి పోతుండగా, ఒక చిన్న కొట్టులో కూరగాయలు అమ్ముతున్న ఒక సుందరీమణి అతని కంట పడింది. ఒకసారి బాగా కళ్లు నులుముకొని మరీ శ్రద్ధగా చూశాడు. 'అరె, ఇది మన ఫాతిమా బేటి గదా?' ఆ కొట్టుముందు సైకిల్ రిక్షా ఆగింది. చాచాను చూడగానే ఆమె బయటకు దూకి సలాం చెప్పి చాచా, చేయి పట్టుకుంది.

''ఏం బేటీ! నీ కొఱకు, నీ తల్లిదండ్రులు ఎంత ఏడుస్తున్నారో తెలుసా? నీకోసం అన్వర్ ఎంత బాధపడుతున్నాడో తెలుసా? బెంగుళూరులో బంగళా అంతా వదిలేసి నువ్విక్కడకొచ్చి కూరగాయలమ్ముతున్నావా? క్యాహోగయా బేటీ... నీకు మతిపో యిందా?''

ఎంతో సంతోషంగా నవ్వుతూ ''చాచా! చాచా! నేను ఇక్కడ ఎంత సుఖంగా వున్నానో నీకు తెలుసా? నాకు బంగారమొద్దు, బెంజ్ కారువద్దు. నాకు కొంచెం ''మొహబ్బత్'' కావాలంటే ఎవరిస్తారు? ఆ సేఠ్ దగ్గర అది వుందా?'' అని ఆమె అడిగింది.

''బేటీ ఫాతిమా, నువ్వింక ఏం చెప్పొద్దు. నీకిక్కడ ఎవరున్నారు? రా! ఎక్కు, మనం తిరిగి బెంగుళూరు వెళ్దాం.''

''లేదు చాచా! నేను ఇంక బెంగుళూరు రాను. ఇక్కడ నాకు అన్నీ వున్నాయి. ఈ కూరగాయలమ్మడంతో, నలభై, యాభై రూపాయలు దొరుకుతాయి. అటు చూడు, ఆ ఆటోరిక్షా దగ్గర సిగరెట్ కాలుస్తూ నిలబడ్డ ఆ అందగాడు, ఆ 'జవాన్ మరద్'... ఆయన కండలు చూశావా? ఏం బాడీనో నీకు తెలుసా? అతనే నావాడు. అతను కూడా రోజుకు యాభయ్యో, అరవయ్యో సంపాదిస్తాడు. షరాబ్ చేత్తో ముట్టుకోడు. మేమెంత సుఖంగా వున్నామో నీకు ఊహించడం కూడా సాధ్యం కాదు. బెంగుళూరు నరకమైతే, ఈ హైదరాబాదులో నేను స్వర్గం కనిపెట్టాను చాచా. నా అంత అదృష్టవంతురాలు ఈలోకంలోనే ఎవ్వరూ లేరని అనుకుంటున్నాను చాచా.''

ఆమె ఆహ్లాద వదనం చూసి, ఆమె చెప్పేదంత నిజమనని అతనికి కూడా అనిపించింది. ''బేటీ, మీవాళ్లకు ఈ విషయం తెలిపి, నేను నచ్చ చెపుతాను. నీకు ఏ అవసరమొచ్చినా, ఈ బూఢా చాచా వున్నాడని మరచిపోవద్దు''. 'ఖుదాహపీజ్' చెప్పి అతను సైకిల్ రిక్షాలో ముందుకు సాగేటప్పుడు, అతని కళ్లముందు మంచుతెర వ్యాపించినట్టు అనిపించింది... అది సంతోషం వల్లనే.

---